క్లుప్తంగా

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధురాలికి చీర పంపిణీ చేస్తున్న శేఖర్ బాబు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : సమాజంలో ఆపదలో ఉన్నవారికి, పేదలకు, వృద్ధులకు ప్రతి ఒక్కరూ తమకు తోచిన సహాయం చేయడం ద్వారా మానసిక సంతృప్తిని మూటగట్టుకోవచ్చని నగరానికి చెందిన సాయి సేవా సంస్థ అధ్యక్షుడు మిరియాల శేఖర్ బాబు తెలిపారు. ఆదివారం స్థానిక కొమడవోలు హమాలీ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సీహెచ్ స్వామి, మరియమ్మ దంపతుల సహకారంతో పేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేసి అనంతరం భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ వికలాంగులు, నిరుపేద కుటుంబాలకు చేతనైన సహాయం చేయడం ద్వారా కలిగే సంతృప్తి వర్ణనాతీతమన్నారు.

రేపు మహాత్మా జ్యోతిబా పూలే జయంతి

ఏలూరు (టూటౌన్) : ఆధునిక భారత ప్రథమ సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబా పూలే 196వ జయంతిని ఈ నెల 11న స్థానిక ఆర్‌ఆర్ పేటలోని బీసీ సబ్ ప్లాన్, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన పోరాట వేదిక ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో–కన్వీనర్ అగొల్ల కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి బీసీ సంఘాల నాయకులు, వృత్తి సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతన బకాయిలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్) : మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రావాల్సిన మార్చినెల జీతం, 3 నెలల హెల్త్ అలవెన్స్‌ల బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఏలూరు జిల్లా కమిటీ ఒక ప్రకటనలో కోరింది. కార్మికులకు ఒకటో తేదీన చెల్లించాల్సిన జీతాలు 10వ తేదీ వచ్చినా చెల్లించకపోవడం దారుణమని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య, అధ్యక్షులు ఆర్ నాగరాజు, కార్యదర్శి ఏ.జాన్ బాబు అన్నారు. ఒక్కో కార్మికుడికి ప్రభుత్వం రూ.50వేల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందని, వీటిని వెంటనే చెల్లించాలని వారు కోరారు. బకాయి జీతాలు, బకాయి హెల్త్ అలవెన్స్‌ల కోసం ఈ నెల 11వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చిందని వారు తెలిపారు. ఆ పిలుపులో భాగంగా జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు మున్సిపాల్టీలలో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మనలోని దుష్టశక్తులను జయించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : సమాజంలో మానవులు తమలోని స్వార్థం, అహంకారం అనే దుష్టశక్తులను జయించాలని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు పిలుపునిచ్చారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి కథీడ్రల్‌లో శనివారం అర్ధరాత్రి నుంచి నిర్వహించిన క్రీస్తు పునరుత్థాన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిషప్ జయరావు మాట్లాడుతూ ఏసుప్రభువు సాతాను శక్తులు, మరణంపై విజయం సాధించినట్లుగా అన్యాయం, ఇతర దుష్టశక్తులపై విజయం సాధించాలన్నారు. దేవునిపట్ల నిజమైన భక్తి, పరోపకార బుద్ధితో సమాజానికి మేలు చేయాలని హితవు పలికారు. 40 దినాల ఉపవాస ప్రార్థనల అనంతరం ఇటువంటి పునరుత్థాన వేడుకలు నిర్వహించడంతో ప్రజల్లో ఆధ్యాత్మిక భావనలు మరింత పెంపొందుతాయన్నారు. అంతకు ముందు అమలోద్భవి కథీడ్రల్ విచారణ కర్త ఫాదర్ ఇంజమాల మైఖేల్ ఆధ్వర్యంలో కథీడ్రల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆరాధన కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా బిషప్ జయరావు ప్రత్యేక పూజ సమర్పించి, ఈస్టర్ కేక్ కట్ చేసి విశ్వాసులకు దైవ సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ బి.రాజు, దివ్యవాణి టీవీ ఛానల్ నూతన సీఈఓ ఫాదర్ లూర్దురాజు, ఫాదర్ ఎం.అగస్టిన్, ఫాదర్ స్టీవెన్ థామస్, పలువురు సిస్టర్స్, చర్చి కౌన్సిలర్లు, స్థానిక కార్పొరేటర్ ఎం.నిర్మలా జేవియర్ తదితరులు పాల్గొనగా ఫాదర్ కె.జోజిబాబు వందన సమర్పణ చేశారు. అలాగే ఈస్టర్ పర్వదినం సందర్భంగా నగరంలోని క్రైస్తవ సమాధుల తోటల్లో, వివిధ ప్రాంతాల్లోని చర్చిల్లో విశ్వాసులు తమ పూర్వీకులు పునరుత్థానులై రావాలని వేడుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


ఈస్టర్ వేడుకల్లో భాగంగా క్యాండిల్ లైట్ సర్వీస్‌లో పాల్గొన్న ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు


తంగెళ్ళమూడిలోని క్రైస్తవ సమాధుల తోటలో ప్రార్థనలు నిర్వహిస్తున్న విశ్వాసులు


మేరీమాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎంఆర్ పెదబాబు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు

మేరీమాత విగ్రహావిష్కరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఈస్టర్ పర్వదినం సందర్భంగా స్థానిక వెంకన్న చెరువు సమీపంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సానాశి రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేరీమాత విగ్రహాన్ని నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎంఆర్ పెదబాబు ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానికులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ బోర్డు డైరెక్టర్ దిరిశాల వరప్రసాద్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కో–ఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్ గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలతో కొల్లేరు కలుషితం

ఏలూరు రూరల్ : కొల్లేరు అభయారణ్య పరిసరాల్లో కోళ్ల వ్యర్థాలతో చేపల సాగు చేస్తుండడం వల్ల కొల్లేరు కలుషితమౌతోందని లంకగ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏలూరు మండలం కొల్లేరు గ్రామాలైన శ్రీపర్రు, పెదయాగనమిల్లి, కోమటిలంక వద్ద కొంతమంది చెరువుల యజమానులు కోళ్ల వ్యర్థాలను మేతగా ఉపయోగిస్తున్నారు. చెరువు గట్లపై రేకు పడవల్లో వ్యర్థాలు ఉడకబెట్టి చెరువుల్లో పోస్తున్నారు. దీని వల్ల తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. మరికొంత మంది క్రషర్ యంత్రాలతో వ్యర్థాలను ముక్కలు చేసి చెరువుల్లో పోస్తున్నారు. రోజుకు 10 నుంచి 14 వ్యానుల్లో వ్యర్థాలు కొల్లేరులోనికి తరలిపోతున్నాయి. ఇలా చేపల సాగుకు కోళ్ల వ్యర్థాలు ఉపయోగించడం వల్ల చెరువు నీరు పసర్లు పట్టి మురుగుగా మారిపోతోంది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్న ఈ నీటిని యజమానులు కొల్లేరులోకి వదిలేస్తున్నారు. దీంతో స్థానిక గ్రామాల ప్రజలు కొల్లేరులో నీటిని ఉపయోగించేందుకు భయపడుతున్నారు. పశువుల సైతం నీటిని తాగేందుకు జంకుతున్నాయి. ఈ కారణంగా అభయారణ్య పరిసర వాతావరణం దుర్గంధం జల్లుతోందని పర్యాటకులు సైతం ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా మంచినీటి సరస్సుగా పేరు గడించిన కొల్లేరు మురుగునీరుగా మారిపోతోంది.


కోమటిలంక పరిసరాల్లో కోడి వ్యర్థాలతో సాగు చేస్తున్న చెరువు

పెట్టుబడి తగ్గుతోంది

సాధారణంగా చెరువుల యజమానులు పిల్లెట్స్, తవుడు, కోడిపెంటతో చేపల సాగు చేస్తారు. ఇందు కోసం పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టాల్సి ఉంది. కానీ కోళ్ల వ్యర్థాలతో చేపల సాగు చేయడం వల్ల పెట్టుబడి ఖర్చు 50 శాతం తగ్గుతుంది. దీంతో కొందరు యజమానులు కక్కుర్తి పడి వ్యర్థాలను ఉపయోగిస్తున్నారు.

పట్టించుకోని అటవీశాఖ

అటవీశాఖ అధికారులు కోడి వ్యర్థాల రవాణ అడ్డుకోవడం లేదని కొల్లేరు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి పదుల సంఖ్యలో వస్తున్న వ్యర్థాల గల వ్యాన్లు శ్రీపర్రు, మాధవాపురం అటవీ చెక్‌పోస్టుల మీదగా కొల్లేరులోనికి వెళుతున్నాయి. చెక్‌పోస్టు సిబ్బంది కాసులకు కక్కుర్తిపడి వ్యాన్లు వదిలేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కొల్లేరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆటో బోల్తా.. మహిళకు గాయాలు

పెనుగొండ: దొంగరావిపాలెం వద్ద జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఆదివారం సిద్ధాంతం నుంచి తణుకు వెళుతున్న వెళుతున్న ఆటో దొంగరావి పాలెం వద్ద అదుపు తప్పి బోల్తా పడింది, ఆటోలో ఉన్న మహిళ తలకు బలమైన గాయం కావడంతో హైవే అంబులెన్స్‌లో తణుకు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన మహిళ తాడేపల్లి గూడేనికి చెందిన కట్టా దేవి అని పేర్కొన్నారు.

అల్లా బోధనలు అందరూ పాటించాలి


ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : అల్లా బోధనలు అందరూ పాటిస్తూ రంజాన్ పండుగను ఎంతో సంతోషంగా జరుపుకోవాలని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ఏలూరు పట్టణ ముస్లిం మైనార్టీ మహిళల ఆధ్వర్యంలో ఆదివారం తంగెళ్ళమూడి దర్గాహ్–ఈ–ఇస్లామిక్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆవరణలో జరిగిన ఇఫ్తార్ కార్యక్రమంలో నూర్జహాన్ పెదబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం మైనార్టీ మహిళల ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా ఏటా రంజాన్ పండుగ నెల రోజులు దీక్షలు చేస్తూ అల్లా అనుగ్రహం పొందడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. అల్లా బోధనల ప్రకారం ప్రతి ఒక్కరూ తోటివారికి సహాయ పడాలని, క్రమశిక్షణతో నడుచుకోవాలని ఆమె సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను అందరూ ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని కోరారు. రంజాన్ పండుగ నెల రోజులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని, నగర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. 48, 40 , 16వ డివిజన్ల కార్పొరేటర్లు నున్న స్వాతి కిషోర్, తుమరాడ స్రవంతి, జుజ్జవరపు విజయనిర్మల, కార్యక్రమం నిర్వాహకులు అన్సారి పాల్గొని ఇఫ్తార్ స్వీకరించారు.


ముస్లిం మహిళలను అభినందిస్తున్న నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు

11న విగ్రహాల ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్) : ఈ నెల 11న ఉదయం 10 గంటలకు మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రి భాయి పూలే విగ్రహాలను స్థానిక జ్యూట్ మిల్లు సెంటర్‌లో ఆవిష్కరించనున్నట్లు బీసీ కులాల జేఏసీ ఒక ప్రకటనలో తెలియజేసింది. బీసీ సోదరులు, ఉద్యోగుల సహకారంతో ఏర్పాటు చేయనున్న ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ కోటగిరి శ్రీధర్, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ పలువురు బీసీ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సోదరులు, బీసీ ఉద్యోగులు, మేధావులు, ఎస్సీ, ఎస్టీ సోదరులు ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి సాయం


సహాయం అందజేస్తున్న దృశ్యం

టి.నరసాపురం : అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి పట్ల చిన్ననాటి స్నేహితులు ఔదార్యం చూపి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని వెలగపాడు గ్రామానికి చెందిన కుమ్మరి ఏసుబాబు ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగించేవాడు. అంతేకాకుండా చిత్ర కళాకారుడుగా పని చేశాడు. అయితే ఇటీవల అనారోగ్యానికి గురై బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు 1991 నాటి బ్యాచ్ పూర్వ విద్యార్థులు (కామవరపుకోట) రూ.55 వేలు సమకూర్చి స్నేహితుని వైద్య సహాయం నిమిత్తం అతనికి అందజేశారు.

మల్లోలు రహదారిని బాగు చేయండి


మల్లోలు రహదారి పరిస్థితి చూపుతున్న రైతులు

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలోని మల్లోలు రహదారిని అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. కొయ్యలగూడెం వ్యాప్తంగా 60 శాతానికి పైగా ఉన్న రైతులకు మల్లోలు రహదారి ప్రధానమని ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు జలమయమైందన్నారు. దీని వల్ల పండిన పంటను సకాలంలో తీసుకువెళ్లలేకపోతున్నామని, పొలాల్లోనే పంటను ఉంచడం వల్ల నష్టపోతున్నామని రైతులు వాపోయారు. మల్లోలు రహదారి వందలఏళ్ల క్రితం నుంచి ఉన్నదని ఈ రహదారికి ఇరువైపులా నివాసిత ప్రాంతాల ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇదే ప్రాంతంలో ఇటీవల జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం చేపట్టారని రోడ్డు అధ్వానంగా ఉండడం వల్ల మెటీరియల్‌ని ఇళ్ల నిర్మాణదారులు తీసుకువెళ్లలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మల్లోలు రహదారిని అభివృద్ధి చేయాలని, కనీసం గ్రావెల్ రోడ్డు నిర్మాణమైనా చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లు దాఖలు చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లు ఇంకా ఇవ్వని వారు ఈ నెల 14లోపు సంబంధిత సబ్ ట్రెజరీ కార్యాలయంలో దాఖలు చేసుకోవాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తాడేపల్లిగూడెం అధ్యక్షుడు బి.హరికుమార్ విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ సమావేశం ఆదివారం పట్టణ కార్యాలయంలో నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో జిల్లా అధ్యక్షుడిగా బి.హరి కుమార్, కార్యదర్శిగా వై.వి.సత్యనారాయణ, కోశాధికారిగా వంగపండు రామ్మోహన్‌రావు ఎన్నికయ్యారు. వారిని పెన్షన్‌దారులు ఆదివారం సత్కరించారు.

భగవద్గీత శ్లోక పఠన పోటీలు

భీమవరం (ప్రకాశంచౌక్): భగవద్గీత శ్లోక పఠన పోటీలకు విశేష స్పందన వచ్చింది. ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ అధ్వర్యంలో భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి చిన్నారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. చిన్నారులు భగవద్గీతను పఠిస్తున్నంత సేపు ఆహుతులు తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా యూకే విశ్వనాథరాజు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ భగవద్గీత చదవాలనే అనే ఉద్దేశంతో వయస్సుతో సంబంధం అందరికీ పోటీలు నిర్వహస్తుమన్నామన్నారు. సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ భగవద్గీతను చదవడం వల్ల, ఆలపించడం వల్ల ముక్తిని పొందవచ్చన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	22	చామదుంపలు	68
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	08-10
బెండకాయలు	20	కంద	46
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	36
కాకర కాయలు	30-34	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	60	అల్లం	120
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	24	చుక్కకూర	10
బంగాళదుంపలు	20	తోటకూర	08
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30	బజ్జీ	60
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	15	చిలకదదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	34
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	28
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	12
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

రక్తకణాల పెరుగుదలపై అవగాహన తప్పనిసరి


పద్మశ్రీ డాక్టర్ నళినీ పార్థసారథిని సన్మానిస్తున్న హీమోఫీలియా విజయవాడ చాప్టర్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : మానవ శరీర నిర్మాణంలో అత్యంత ప్రత్యేకమైనది రక్తమేనని, రక్తం ప్రాముఖ్యత, దాని ఆవశ్యకతలపై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని పాండిచ్చేరికి చెందిన హీమోఫీలియా సొసైటీ పాండిచ్చేరి చాప్టర్ అధ్యక్షురాలు పద్మశ్రీ నళినీ పార్థసారధి పిలుపునిచ్చారు. ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం సందర్భంగా హిమోఫిలియా సొసైటీ విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మానవుని శరీరంలో రక్తం ప్రాముఖ్యత, రక్తకణాల పెరుగుదల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నళినీ పార్థసారధి మాట్లాడుతూ గత ముప్పై సంవత్సరాలుగా హిమోఫిలియా సొసైటీని ప్రారంభించి దేశవ్యాప్తంగా హిమోఫిలియా బాధితులకు వైద్య సేవలు, శస్త్రచికిత్సలు అందిస్తున్నామన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తనకు అందించిన పద్మశ్రీ అవార్డ్ హిమోఫిలియా సొసైటీకి, దానిలో పనిచేసిన అందరికీ చెందుతుందన్నారు. అనంతరం డాక్టర్ నళిని పార్థ సారధిని ఘనంగా సత్కరించారు. ఈ సభకు హీమోఫీలియా విజయవాడ చాప్టర్ కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షత వహించగా దంత వైద్య నిపుణులు వంశీ కృష్ణ, సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, పీజీ కోర్సుల డైరెక్టర్ కేవీఆర్ ఎస్ఎస్ కొండయ్యారావు, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పీ.శైలజ, హీమోఫీలియా బాధితులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలి

ఏలూరు (టూటౌన్) : రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. స్థానిక అన్నే భవన్ వద్ద సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహా అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రబీ కోతలు ప్రారంభమై కళ్లాల్లోకి ధాన్యం వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. ధాన్యం కొనుగోలు నూతన విధానం పేరుతో ఖరీఫ్‌లో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. గత ఖరీఫ్ సమస్యలు పునరావృత్తం కాకుండా రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో ధాన్యం కొనుగోలుపై ముందస్తుగా చర్చించి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణం కొనుగోళ్ల లక్ష్యం ప్రకటించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. రైతులు పండించిన పంటలు 60 శాతం మాత్రమే కొనుగోలు చేస్తామనే నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలో సరాసరి దిగుబడి 37 బస్తాలు కాగా ఏలూరు జిల్లా పరిధిలో 50 బస్తాలకు పైబడి దిగుబడి వస్తోందన్నారు. దీనికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను తెరచి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఎర్రకాలువ వంతెనపై గోతుల పూడ్చివేత

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఎర్రకాలువ వాగు వంతెనపై గోతులను పూడ్చారు. కామవరపుకోట సోషల్ వర్కర్స్ టీం ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. సోషల్ వర్కర్ వీరమల్లు మధు ఆధ్వర్యంలో టీం సభ్యులు పందూరి రామసాయి, వీరమల్ల సాజన్ సాయి గ్రావెల్ మెటల్‌ను సిమెంట్‌తో కలిపి గోతులను పూడ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంతెనపై గోతులు ఏర్పడి ఇనుప ఊచలు పైకి లేచి పోవడంతో వాహనాల రాకపోకల సమయంలో టైర్లు పంక్చర్లు పడుతూ, ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఆలోచనతో గోతులను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.


ఎర్రకాలువ వంతెనపై గోతులు పూడ్చిన సోషల్ వర్కర్స్ టీం సభ్యులు

వచ్చే ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్ సీపీదే

ఏలూరు రూరల్ : రానున్న ఎన్నికల్లో ప్రజలు మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే పట్టం కడతారని ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు నమ్మకాన్ని వెలిబుచ్చారు. ఏలూరు మండల కొక్కిరాయిలంకలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కొల్లేరు గ్రామాల్లో కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. మూడున్నరేళ్ల కాలంలో ప్రతి ఇంటికీ కుళాయి, ప్రతి ఊరుకి ఓవర్‌హెడ్ ట్యాంక్, కొత్త పైప్‌లైన్, వాడవాడల సీసీరోడ్లు అభివృద్ధి చేయడం వల్ల కొల్లేరు ప్రజలు అబ్బయ్యచౌదరిపై ఎంతో నమ్మకాన్ని పెంచుకున్నారని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలుకుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే మరోసారి బ్రహ్మరథం పడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తేరా ఆనంద్, గుర్రం శివ, సర్పంచ్ తోకల అమల తదితరులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెదపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003లో పదో తరగతి చదివిన తోటి విద్యార్థిని సురేఖకు స్నేహితులంతా కలిసి రూ. 20వేలు ఆర్థిక సాయం అందించారు. పెదపాడు శివారు రామచంద్రపురానికి చెందిన సురేఖ కుమార్తె ఇటీవల మరణించడంతో ఆమె ఆర్థికంగా ఇబ్బందులు పడుతోందని తెలుసుకుని ఆదివారం ఆమె నివాసానికి వెళ్లి తమ వంతు సాయం అందించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరుకు చెందిన కర్రి శివశంకర్ ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ కేఎల్ఎన్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.